


# తెలుగు కథను అన్ని భాషల్లోనూ అనువదించాలి

## - ఆదూరి వెంకట సీతారామమూర్తి

అచ్చ తెలుగు కథల రచయిత ఆదూరి వెంకట సీతారామమూర్తి. మధ్య తరగతి జీవితంలోని అన్ని రసాలనూ తన కథల్లో ఆవిష్కరించి అద్దంలో చూపించినట్లు పాఠకుల ముందు ప్రతిబింబిస్తారు. కథా సాహిత్య ప్రపంచంలోకి ఒక ఆరాధనా భావంతో అడుగుపెట్టిన కొద్దిమంది రచయితల్లో అతి నిరాడంబర యోగి. సాహిత్యమూ జాతి సంస్కృతి అవిభాజ్యాలనే ఒక వెన్నెలదారిలో పయనిస్తున్న బాటసారి ఆదూరి. ఆ కథా శిల్పితో ఈ వారం ఇంటర్వ్యూ...



కుటుంబ సభ్యులతో....

## బాల్యం ఆటపాటలతో...

ఖద్దరుకు ప్రసిద్ధిచెందిన శ్రీకాకుళం జిల్లాలోని పొందూరులో 1947వ సంవత్సరం ఏప్రిల్ నెల 22న పుట్టాను. సత్యవతి, పేర్రాజుగార్లు మా అమ్మానాన్నలు. రైల్వేలో పనిచేసిన నాన్నగారికి తరచూ బదిలీలు ఉండేవి. సరైన స్కూల్ లేకపోవడం వల్ల అయిదో తరగతి వరకూ ఇంటి వద్దే చదువుకున్నాను. మొదట్లో ఏడాదిపాటు ఓ పంతులుగారు వారంలో మూడు రోజులు ఇంటికి వచ్చి చదువు చెప్పేవారు. ఆ తర్వాత మూడు సంవత్సరాలు వంశధార నది ఒడ్డున బాల్యం గడిచింది. తెలుగు స్కూలు లేక అక్కడా చదువు ఇంటివద్దే-నాన్నగారే గురువు. ఉదయం తప్పని సరిగా లెక్కలు; రాత్రి పూట మిగిలిన పాఠాలు. అప్పటి పాఠ్య భాగ క్రమానుసారం తరగతి పుస్తకాలు తెప్పించి చదివించేవారు. అయితే రోజులో చదువు కొద్ది గంటలే! మిగతా రోజంతా వంశధార నది ఒడ్డున, రైళ్లు రానివేళల్లో ప్లాట్‌ఫారాల మీదా, నూరు వరహాల చెట్ల కిందా ఆటలూ, పాటలూ, గాలి పటాలు తయారుచేసుకుని ఎగరేసుకోడాలూ. ఎనిమిదేళ్ల వయసులో విజయనగరం మున్సిపల్ హైస్కూల్‌లో ఫస్ట్‌ఫారంలో చేరేను. తర్వాత ఫోర్త్‌ఫారం నుండి డిగ్రీ వరకూ విశాఖపట్నం ఎ.వి.ఎన్.కాలేజీ హైస్కూల్ లోనూ, కాలేజీలోనూ చదువు కొనసాగింది. డిగ్రీ మొదటి సంవత్సరంలో వుండగా నాన్నగారు హఠాత్తుగా పోవడంతో చదువు డిగ్రీతోనే ఆపేసి ఉద్యోగంలో చేరాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## నాన్నగారి ద్వారా సాహితీ పరిచయం

నాన్నగారు సాహిత్యాభిమాని. బదిలీల మీద ఏ వూరు వెళ్లినా అక్కడికి తెలుగు పుస్తకాలు వారపత్రికలూ చందా కట్టి మరీ తెప్పించే వారు. ఆంధ్రప్రభ వారపత్రిక నాలుగు అణాల వెల వుండగా నాకు తెలుసు. తెలుగు నవలలు, కథల పుస్తకాలతో పాటు నాళం కృష్ణారావు, గుఱ్ఱం జాషువా, జంధ్యాల పాపయ్యశాస్త్రి వంటి సాహితీ స్రష్టల రచనలూ, రామాయణ, భారత, భాగవతాది గ్రంథాలూ, జైమినీ భారతం వంటి పుస్తకాలు ఎన్నో ఆయనకు నచ్చిన వాటిలో ఒక చిన్న గ్రంథాలయం మా ఇంట్లో ఉండేది. సుమతి, వేమన శతకాలతోపాటు ఉదయశ్రీ, కరుణశ్రీల లోని పద్యాలు నా చేత చదివించేవారాయన. ఆయన ద్వారా సంక్రమించిన ఆ సాహితీ సుగంధమే నేనీనాడు ఇలా రచనలు చేయడానికి దోహదపడింది. సాహిత్యంలో నాకు గురువులెవరూ లేరు. నేను కథా రచన ప్రారంభించిన తరువాత మధురాంతకం రాజారాం సంకలనం చేసిన 'తొలినాటి తెలుగు కథ నుండి-ఒక దశాబ్ది తెలుగుకథలు; వాకాటి పాండు రంగారావు సంకలనం చేసిన 'కథా భారతి'... ఇలా ఎన్నో కథల సంపుటాల్లోని వివిధ రచనలు చదివాను. నచ్చిన కథల్లో కథకులు ఏం చెప్పారో? ఎలా చెప్పారో అధ్యయనం చేశాను. ఆ అధ్యయనం నన్ను ఎంతో మార్చింది. కథ రాసిన ప్రతిసారీ దాని స్వరూప స్వభావాలు మార్చుకుంటూ శిల్పరీత్యా ఎదిగేలా చేసింది.

## తొలి కథ కృష్ణా పత్రికలో

'ఎర్రమందారం' కథ తొలిసారిగా 1967లో కథాంజలిలో అచ్చయినా, రాసిన మొదటి కథ 'బ్రతుకు' మాత్రం 1970 ప్రాంతంలో 'కృష్ణా పత్రిక'లో వచ్చింది. తరువాత రోజుల్లో ప్రగతి, ఉజ్జీవన వంటి ఇతర పత్రికల్లో ప్రచురించబడిన నా కథలు అతిశ్రద్ధ, అశ్రద్ధ వల్ల ఒక్క కాపీ కూడా నా దగ్గర లేకుండా పోయాయి. ఇంతవరకు 180 కథలు వివిధ పత్రికల్లో చోటు చేసుకున్నాయి. పదిహేను కథలకు బహుమతు లొచ్చాయి. మూడు నాటికలు, 25కు పైగా రేడియో నాటికలు, ఎన్నో కవితలు వెలుగు చూశాయి. 82 కథలు సంపుటాల రూపంలో వచ్చాయి.

## సతీమణి విదుషీమణి

సత్యవతీదేవితో నా వివాహం 1969లో జరిగింది. ఆమె సాహిత్య పిపాసి, కవయిత్రి. ప్రాచీన సాహిత్యాన్ని చదివి అప్పటికే లలితగీతాలూ, వచన కవితలూ రాస్తూండేది. పుస్తకాల ద్వారా ఏర్పడ్డ పరిచయమే పెళ్లికి దారి తీసింది. అలా నా జీవితంలోకి ప్రవేశించి విలక్షణమైన సంస్కార వంతమైన వ్యక్తిత్వంతో ఒక కాంతిరేఖగా భాసిల్లింది. కవయిత్రిగా ఎన్నో అవార్డులతో పాటు తెలుగు విశ్వవిద్యాలయం నుండి 'ఉత్తమ రచయిత్రి' అవార్డును అందుకున్న సాహితీవేత్త, 2008 సంవత్సరంలో తను ఆరాధించే ప్రకృతిలోకే తరలిపోయింది. మాకు ఇద్దరబ్బాయిలు. రాజ్‌కుమార్, భార్గవరాం, ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కోడళ్లు పల్లవి, శైలజ మనవలు హరివంశరాజ్ కౌశిక్, కౌస్తుభ శోభిత్.

## మా ఇంట్లోనే సాహితీ సమావేశాలు

1979లో మా ఇంటి గృహప్రవేశ సందర్భంగా ఇంట్లో ఏర్పాటుచేసిన ప్రత్యేక సాహితీ సమావేశంలో వాకాటి పాండు రంగారావు ప్రముఖంగా భగవద్గీత గురించి మాట్లాడేరు. ఆ తరువాత క్రమంగా మా ఇల్లు సాహితీ సమావేశాలకు నిలయమైంది. బలివాడ కాంతారావు, ఆవంత్స సోమసుందర్, అవసరాల రామకృష్ణారావు, యండమూరి వీరేంద్రనాథ్, ముద్దంశెట్టి హనుమంతరావు, పులికంటి కృష్ణారెడ్డి, మధురాంతకం రాజారాం వంటి ఎందరో కథకులతో, కవుల రాకతో మా గృహం సాహితీ పరిమళాలు వెదజల్లేది. ఈ సభల నిర్వహణలో ఆహుతులకు ఆతిధ్య మివ్వడంలో నా శ్రీమతి సత్యవతీదేవి పాత్ర మరచిపోలేనిది.

## తిరిగొచ్చిన రచనతో మరింత మంచిపేరు

తిరిగొచ్చిన నా రచనలు కూడా విచిత్రంగా నాకు మంచి పేరునే సంపాదించి పెట్టాయి. 1981లో 'యువ' మాసపత్రికలో చక్రపాణి అవార్డును గెల్చుకున్న నా 'శిల్పి' కథను మొదట ఒక మాసపత్రిక తిప్పి పంపేసింది. మళ్లీ అదే కథ సరిగ్గా 20 ఏళ్ల తర్వాత మరో రూపంలో నా ముందుకొచ్చి నన్నాశ్చర్యపరిచింది. 'మహారాష్ట్ర స్టేట్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్' వారు వారి పదవ తరగతి విద్యార్థుల పాఠ్య గ్రంథమైన 'కుమార భారతి'లో నా కథను పాఠ్యాంశంగా నిర్ణయించి అనుమతి కోసం నాకు ఉత్తరం రాయడం; 2001 సంవత్సరం నుండి ఆరేళ్లకు రాయల్టీ పంపడం నాకెంతో ఆనందాన్నిచ్చింది. కాంప్లిమెంటరీ కాపీ 'కుమారభారతి' చూసినప్పుడు ఆ పాఠ్యగ్రంథంలో ఎర్రా ప్రగడ, బమ్మెర పోతన, అల్లసాని పెద్దన్న, దివా




శ్రీమతి ఆదూరి సత్యవతీదేవితో...

కర్ల వెంకటావధాని, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి ప్రసిద్ధుల రచనల సరసన నా కథకు కూడా స్థానం దక్కడం నాకెంతో తృప్తినిచ్చిన విషయం.

### రావి శాస్త్రిగారి మలిమెరుపు

1986లో నేను 'వెన్నెల్లో పావురాళ్లు' కథా సంపుటి తీసుకు రావాలను కున్నాను. అప్పటివరకు నేను రాసిన 50 కథలను 16 మంది సుప్రసిద్ధ కథకుల కిచ్చి వారికి నచ్చిన ఒక్కొక్కకథను వారి అభిప్రాయాలతో ప్రచురించాలనుకున్నాను. ఆ కథకుల జాబితాలో రావి శాస్త్రి గారు కూడా ఉన్నారు. 1980లో భారతిలో అచ్చయిన 'ఈ చీకటి విడిపోలేదు' కథను రావిశాస్త్రి గారికిచ్చాను. అయితే అందరి దగ్గర నుండి అభిప్రాయాలు వచ్చినా 'రాచకొండ' వారి నుండి మాత్రం రాలేదు. పుస్తకం ప్రెస్‌లో ప్రింటవుతోంది. నా ఆఫీసయ్యాక వారింటికి వెళ్తే కోర్టు నుంచి రాలేదనే వారు. కోర్టుకెళ్తే 'ఇప్పుడే వెళ్లిపోయారు' అనేవారు. కలుసుకున్న నాలుగైదుసార్లూ 'ఇంకా రాయలేదు, రాసిచ్చేస్తాను' అనే వారు. ఇక ఇలా కాదని ఓ ఆదివారం ఉదయాన్నే వారింటికెళ్లేను. చిరునవ్వుతో పలకరించి 'ఈ మారు తప్పకుండా రాసిచ్చేస్తాను. బుధవారం సాయంకాలం 5 గంటలు దాటేక కోర్టు లైబ్రరికి రండి' అన్నారు. అలాగే వెళ్లాను. నా అదృష్టం బాగుంది. ఆయన స్వదస్తూరీతో రాసిన అభిప్రాయం సంతకం చేసి మరీ యిచ్చేరు. నా ఆనందం అంబరమంటింది. మరో రెండు నెలల తర్వాత పుస్తకం వచ్చింది. మొట్ట మొదట పుస్తకం పట్టుకుని రావిశాస్త్రి గారింటికి వెళ్లేను. నన్ను చూసి పలకరించి 'రండి. నేను మీకింకా రాసివ్వలేదు కదూ!' అన్నారు అమాయకమైన చిరునవ్వుతో. నేను పుస్తకం ఆయన చేతికందించాను. పేజీలు తిప్పి 'అయితే నేను మీకు రాసి యిచ్చేశానన్న మాట' అంటూ బిగ్గరగా నవ్వేరు.


దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రిని సన్మానం చేస్తూ...

### మధుర జ్ఞాపకాలు

1970లో శ్రీశ్రీ షష్ఠి పూర్తి ఉత్సవాలు విశాఖపట్నంలోని జరిగినప్పుడు టర్నర్ సత్రం నుండి మున్సిపల్ స్టేడియం వరకూ శ్రీశ్రీ గారి వెంట మిగిలిన కవులతో కలిసి నడిచి వెళ్లి సమావేశంలో పాల్గొనడం, గురజాడ జయంతి నాడు రావి శాస్త్రితో కలిసి ఎల్లమ్మ తోట నుండి పాద యాత్ర చేసి ఆర్టీసీ బస్టాండు జంక్షన్‌లో కొత్తగా ఆవిష్కరించిన గురజాడ అప్పారావు విగ్రహానికి పూలమాలలు వేయడం, మా ఇంటికి అతిథులుగా వచ్చిన మధురాంతకం రాజారాం గారినీ, మునిపల్లె రాజు గారినీ ఆకాశవాణిలో నేను ఇంటర్వ్యూ చేయడం మరచిపోలేని మధుర జ్ఞాపకాలు. అలాగే తనకు నచ్చిన కొద్దిమంది కథకులలో ఒకడిగా చాసో గారు నన్ను గూర్చి 'జ్యోతి' మాసపత్రిక ఇంటర్వ్యూలో చెప్పడం కూడా తీపి గుర్తే.

### రచయితలు అన్ని సమస్యలపైనా కథలు రాయాలి

సమాజం ఒక మూడంతస్తుల మేడ అనుకుంటే ఒక్కొక్క అంతస్తులోనూ ఒకొక్కరకమైన జీవన విధానం వుంటుంది. జీవన సమస్యలు విభిన్నంగా వుంటాయి. రచయిత అన్నిరకాల జీవన విధానాలపైనా, సమస్యలపైనా రచనలు చెయ్యాలనీ చేతనైతే అన్ని ప్రక్రియలూ స్పృశించి పాఠకులకు దగ్గరవ్వాలని అనుకుంటాను.


రావిశాస్త్రి, భరాగోలతో...

## నాకు నచ్చినవి

| | | |
|---|---|---|
| కవి | : | దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి |
| కథకుడు | : | చలం |
| నవలలు | : | అల్పజీవి, చివరకు మిగిలేది |
| కథలు | : | చాలా వున్నాయి |
| సినిమాలు | : | సీతా కల్యాణం (బాపు)<br>సాగరసంగమం (కె.విశ్వనాథ్) |
| గాయని | : | చిత్ర<br>సౌమ్య (కర్ణాటక సంగీతం) |
| గాయకుడు | : | మంగళంపల్లి బాలమురళీకృష్ణ<br>జేసుదాస్ |
| నటుడు | : | చార్లీచాప్లిన్ |
| నటి | : | సావిత్రి |
| వ్యక్తి | : | నిష్కల్మషంగా స్నేహపూర్వకంగా మాట్లాడే అందరూ |
| పాట | : | ఒక పాటకు మేఘమైతిని (లలిత గీతం) |

మానవ జీవితాల్లోని సంక్లిష్టత, పేదరికం, దుఃఖం, అశాంతి, ఒంటరితనం వీటితో పాటు మానసికానందాన్నిచ్చి, వికాసాన్ని కలుగచేసే కథలు కూడా రాయాలని అభిప్రాయ పడతాను. నేను అన్ని రకాల కథలూ రాసాను. ప్రేమ కథలూ, దోపిడీ కథలూ, ఆకలి కథలు, జాలి కథలు, జాలీ కథలు, సమస్యాత్మక కథలు, సంసార కథలు-ఇలా మనసు స్పందించినప్పుడల్లా రాసేను. నా చుట్టూ ఉన్న వాతావరణం లోంచి తీసుకున్న విషయాలతోనే ఎక్కువ కథలు రాసాను. మానవత్వం యితివృత్తంగా గల కథలతో పాటు మనిషికీ మనిషికీ మధ్య అంతరించి పోతున్న ప్రేమాభిమానాలు, స్నేహాలు-వీటిని మళ్లీ జీవితాల్లో ప్రోది చేసుకునే అవసర ముందన్న విషయాలలోనూ కొన్ని కథలు రాసేను. బాల కార్మిక సమస్యలపై రాసిన నా కథలకు పెద్ద బహుమతులే వచ్చాయి.

### తెలుగు కథ ఇతర భాషల్లోకి వెళ్లాల్సినంతగా వెళ్లటం లేదు

మన తెలుగుకథ ఇతర భాషల్లోకి వెళ్లాల్సినంతగా వెళ్లటం లేదేమోనని నాకు అన్పిస్తూంటుంది. ఏ ఇతర ప్రాంతీయ భాషల్లో వచ్చిన కథలకు తీసిపోని గొప్ప, మంచి కథలు మనకు చాలానే వున్నాయి. తెలుగులో వచ్చిన, వస్తూన్న మంచి కథలు, గొప్ప కథలు-ఆయా రచయితలు ఏ తరానికి చెందిన వారైనా, యితర భాషల్లోకి అనువదింపబడాలన్నదే నా ఆకాంక్ష. అప్పుడే మన ఆలోచనలు జాతీయ అంతర్జాతీయ పాఠకులకు అందుతాయి. ఆ మంచి రోజు కోసం ఎదురుచూద్దాం.

-మేడా మస్తాన్‌రెడ్డి
**94413 44365**

